క్లుప్తంగా

మహా ధర్నాను జయప్రదం చేయండి



వెల్దుర్తిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): అసంఘటిత రంగ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. మహా ధర్నాకు సంబంధించిన కర పత్రాలను మండల కేంద్రంలోని వెల్దుర్తిలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, అడ్వైజర్ కమిటీ నియమించి, బోర్డు నిధులు దుబారా చేయకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల కార్యదర్శి గౌరీ, హమాలీ యూనియన్ కార్మికులు సాయిలు, వెంకట్, సత్యం, ఏ.బాబు, సి.బాబు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సిద్దిరాములు మాట్లాడుతూ భారత ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామీణ సాక్షరతా మిషన్ పేరుతో వచ్చిన బ్యాగులను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వసంత, సంతోషిమాత, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్సింగిలో 206 మంది విద్యార్థులకు..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ గ్రామీణ సాక్షరతా మిషన్ 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు బ్యాగులు అందజేసినట్లు ఎంఈఓ మురళీమోహన్ తెలిపారు. మండలంలోని 206 మంది విద్యార్థులకు ఉచిత బ్యాగులు అందించినట్లు పేర్కొన్నారు.

శివ్వంపేటలో ధనలక్ష్మి జాతర



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ధనలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం కనుల పండువగా గురువారం ప్రారంభమైంది. ప్రతిఏట రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం పోతరాజు, గావు, బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు ఇసుగారి పెద్ద నర్సయ్య తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకులు మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, రామగౌడ్, అశోక్, హరీశ్ పాల్గొన్నారు.

నేడు శంకరంపేట తైబజార్ వేలం

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ప్రదీప్ తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ఉదయం 9 గంటలకు తమ పేర్లను నమోదు చేసి, డిపాజిట్ చెల్లించాలని సూచించారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రేపు రేగోడ్‌లో..

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో ప్రతీ బుధవారం జరిగే సంతకు శనివారం ఉదయం 10 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్ తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు నిబంధనలు పాటించాలన్నారు.

24న బొడ్మట్‌పల్లిలో..

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన 2025–26 సంవత్సరానికి గాను ఈనెల 24న తై బజార్ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మౌనిక తెలిపారు. కూరగాయల సంత వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు చెల్లించి, 24న ఉదయం 10గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



రామాయంపేట తండాలో మూతపడ్డ పాఠశాల



వడ్డెర కాలనీలో పాక్షికంగా శిథిలమైన మూతబడిన పాఠశాల

అస్తవ్యస్తంగా ప్రభుత్వ విద్య

రామాయంపేటలో మూతపడ్డ నాలుగు పాఠశాలలు

- విద్యార్థులు లేరనే సాకుతో ఎత్తేసిన వైనం
- కాలినడకన ఇతర స్కూళ్లకు
- భారమవుతున్న ప్రైవేట్ ఫీజులు
- చదువుకు దూరమవుతున్న చిన్నారులు
- తిరిగి ప్రారంభించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతున్నట్లు అధికారులు పదే పదే ప్రకటిస్తున్నా ఆచరణలో మాత్రం కనబడటం లేదనే ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 18 ప్రభుత్వ పాఠశాలలకు గాను నాలుగు మూతపడగా 14 మాత్రమే కొనసాగుతున్నాయి. విద్యార్థులు లేరనే ఉద్దేశంతో మున్సిపాలిటీ పరిధిలోని మూడు ప్రభుత్వ స్కూళ్లను ఎత్తివేయగా, కోమటిపల్లి తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాలను యూపీఎస్‌లో విలీనం చేశారు. దీంతో ఆ నాలుగు పాఠశాలల భవనాలు నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాలను ఇతర అవసరాలకు వినియోగించాలని ప్రజలు కోరుతుతున్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో వేలల్లో ఫీజులు..

రామాయంపేట తండాలో సుమారుగా 12 మంది విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించారు. ఇక్కడ బడీడు పిల్లలు 40 మంది వరకు ఉండగా, కొందరు ప్రైవేట్ స్కూళ్లకు, మిగతావారు కోమటిపల్లిలో ఉన్న యూపీఎస్‌లో చేరారు. కాగా తమ పిల్లలకు ప్రైవేటులో వేల ఫీజులు చెల్లిస్తున్నామని, స్కూలును పునఃప్రారంభించాలని తండావాసులు విజ్ఞప్తి చేశారు. కోమటిపల్లి తండాలో పాఠశాల ఉన్నా గిరిజనుల విన్నపం మేరకు అధికారులు అదే గ్రామంలో ఉన్న యూపీఎస్‌లో విలీనం చేశారు. దీంతో 14 మంది విద్యార్థులు తండా నుంచి ప్రతి రోజు కిలోమీటరున్నర దూరంలో ఉన్న స్కూలుకు చెరువు కట్టపైనుంచి కాలినడకన వెళ్తున్నారు. మరమ్మతుల కోసం రోడ్డుపై కంకర పర్చడంతో వారు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కోమటిపల్లి వడ్డెర కాలనీలో ఉన్న పాఠశాలను ఐదారేళ్ల క్రితమే ఎత్తేయగా, రామాయంపేటలోని చాకలివాడలో ఉన్న ప్రభుత్వ పాఠశాల గతంలోనే మూతపడింది. ఈ స్కూలుకు చెందిన విద్యార్థులు కొందరు బడి మానేయగా, మిగతావారు సమీపంలో ఉన్న స్కూళ్లకు వెళ్తున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు కోరితే...



మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండు ప్రభుత్వ పాఠశాలలను గతంలోనే సమీపంలో ఉన్న ఇతర స్కూళ్లలో విలీనం చేశారు. మరో రెండు స్కూళ్ల విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కోరితే తిరిగి ప్రారంభించడానికి కృషి చేస్తాం.

– శ్రీనివాస్, ఎంఈవో, రామాయంపేట

అక్రమంగా చెరువు నీరు చోరీ..

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు



ఎస్ఐతో మాట్లాడుతున్న నీటి పారుదలశాఖ ఏఈ, రైతులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో కొందరు చెరువునుంచి అక్రమంగా పంటలకు నీరు తరలించుకుపోతున్నారని రైతులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... భూగర్భ జలాలు తగ్గడంతో గ్రామపరిధిలో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో కొందరు పెద్ద చెరువు నుంచి మోటర్లతో అక్రమంగా నీరు తరలిస్తూ తమ పంట చేలకు పారించుకుంటున్నారు. ఈ విషయమై తాము నీటి పారుదల శాఖ అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించిన రైతులు గ్రామంలోకి వచ్చిన ఏఈని నిలదీశారు. అనంతరం వారు ఏఈతో పాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చి అతడిపై కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తాము పలుమార్లు హెచ్చరించామని, అయినా ఖాతరు చేయడం లేదని ఏఈ పేర్కొన్నారు. ఎస్ఐ బాల్‌రాజ్ రైతులను సముదాయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఘనంగా నల్లపోచమ్మ పల్లకీ సేవ



ఆలయం వద్ద పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి జాతర ఘనంగా జరుగుతోంది. గురువారం ఈవో రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా నాలుగో రోజు పాచిబండ్లను ఊరేగించారు. అమ్మవారి ఆలయం వద్ద పల్లకీ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, పర్వతాలు, ప్రభుచారి, తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా దుర్గమ్మపోచమ్మ ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్‌లోని మార్కెట్‌లో వెలసిన గ్రామదేవతలు దుర్గమ్మ–పోచమ్మల ఉత్సవాల్లో భాగంగా గురువారం బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బండ్లను, ఎడ్లను అందంగా అలంకరించి దేవాలయాల చుట్టూ డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. భక్తులు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



టేక్మాల్‌లో బండ్ల ఊరేగింపు

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు



బెల్టులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ నేర్పించడంతో బాలికల డ్రాపౌట్ల సంఖ్య గణనీయంగా తగ్గడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెరిగిందని స్థానిక ఎస్ఐ నర్సింహులు, ఉద్యమ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండ పరిధిలోని చిట్కుల్ కేజీబీవీలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించి, సుమారు వంద మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. గ్రాండ్ మాస్టర్ పోచయ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి అంజలి, పీఈటీ శారద, ఉపాధ్యాయ సిబ్బంది, శిక్షకులు మురళి, సుప్రియ, మహేశ్‌గౌడ్, విష్ణువర్ధన్, సింధు, ప్రణవి, నాగేశ్వరి పాల్గొన్నారు.

పర్మిట్ రూంలకు నిబంధనలు లేవు!

ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూంల విషయంలో ఎలాంటి నిబంధనలు లేవని, మౌలిక వసతులు కల్పించుకోవచ్చని రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని కల్లు డిపో, దుర్గ, తిరుమల మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రోడ్డుకు ఆనుకొని నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐ దృష్టికి తీసుకెళ్లగా పర్మిట్ రూంలు మద్యం దుకాణానికి 100 మీటర్ల దూరంలో ఉందా లేదా అనే విషయాలను మాత్రమే గమనిస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని 15 మద్యం దుకాణాలతో పాటు కల్లు డిపోలను తనిఖీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ సీఐ వెంట ఎస్ఐ విజయ్‌సిద్దార్థ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలి



దీక్షలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: రాబోయే వర్షాకాలం సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సాగు నీటి పారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలకు అవసరమైన మరమ్మతులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. నిధులు రాగానే వేసవి సీజన్‌లో మరమ్మతులు చేపడితే వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అధికారులకు సూచించారు. సమీక్షలో ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈఈలు బుజ్జిబాబు, రాజేందర్‌రావు, జగన్నాథం, అస్రాబేగం, ఏఈఈలు మణిబూషణ్, సునీత, సుధీర్, తబిత, మంజులత, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ రవీంద్ర కిషన్, బీఆర్ఎస్ నాయకులు హరికృష్ణ, శేఖర్, బాల్‌రెడ్డి, నర్సింహులు, నర్సింహా రెడ్డి, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును రద్దు చేయాలి

డంప్‌యార్డును రద్దు చేయాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 30వ రోజుకు చేరగా ఆమె దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ అంశంపై అసెంబ్లీలో మాట్లాడి రద్దు చేయాలని కోరానని గుర్తు చేశారు. కాగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితర పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలో జేఏసీ నాయకులు రాజేందర్, ఆంజనేయులుగౌడ్, భిక్షపతి, రమేశ్‌గౌడ్, కృష్ణ, నగేశ్‌గౌడ్, ఆంజిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వాకిటి లక్ష్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ట్రస్టు చైర్మన్, ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ట్రస్టు ద్వారా పేద ప్రజలకు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం తాగు నీటిని ప్రజలకు అందజేయడంతో పాటు అరటి పండ్లు పంచిపెట్టారు.

గురువారం రాత్రి స్థానిక షాదీఖానాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మసియోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రోగులకు మెరుగైన సేవలు అందుతాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పీహెచ్‌సీకి నీలకంటి దుర్గాప్రసాద్‌తో పాటు బుడాల సాయిలు దవాఖానకు అందించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సైతం రు.55 వేలతో వార్మర్ మెషిన్ అందజేయడానికి చెక్కును, అలాగే మాజీ సర్పంచ్ ఆలుగుల సత్యనారాయణ రూ.30 వేలతో ఇన్వెర్టర్‌ను పీహెచ్‌సీకి అందజేశారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సర్ఫోద్దీన్, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, ఆర్ఎన్. సంతోష్, పెరుమాండ్ల గౌడ్ తదితరులున్నారు.

వరికి ప్రత్యామ్నాయ తడులు అందించాలి



ఎల్లాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): ఎండ తీవ్రతతో బోరు బావుల్లో నీరు తక్కువగా రావడం వల్ల వరి పంటకు చీడపీడలు సోకే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వరి పైరును కాపాడుకోవాలంటే నీరు సంమృద్ధిగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న పొలాల్లో ప్రత్యామ్నాయ తడులు ఇచ్చుకుంటూ వరిని కాపాడుకోవాలని సూచించారు. అందులో భాగంగా అవసరం మేరకు మాత్రమే నీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వందన, రైతులు ఉన్నారు.

వరికి తెగుళ్ల బెడద..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరి పంటకు తెగుళ్లు సోకాయని సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, మండల వ్యవసాయాధికారి నాగ మాధురి తెలిపారు.గురువారం మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో వరి పంటను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. పలు చోట్ల వరి పంటకు అగ్గి తెగుళ్ల, కాండం తొలిచే పురుగు సోకిందన్నారు. అగ్గి తెగులుకు ట్రై సైక్లాజోల్, టెబ్యుకొనాజోల్ మందు, కాండం తొలిచే పురుగుకు టెట్రానిలిప్రోల్ మందులు వాడాలని సూచించారు. అధికారుల వెంట జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఏఈవో అభిలాష్ ,రైతులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

నర్సాపూర్ రూరల్: ప్రతి రైతు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దీపిక రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కాగజ్ మద్దూర్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రతల కారణంగా సాగునీటి సమస్య జటిలంగా తయారైందన్నారు. అవసరం మేరకు మాత్రమే వరి పంటలకు నీటిని పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లు దుర్గా ప్రసాద్, చంద్రవేణి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ భూసార పరీక్షలు తప్పనిసరి



కౌడిపల్లి(నర్సాపూర్): భూసార పరీక్షలు చేయించుకుంటే నేల పరిస్థితులు తెలుసుకోవడంతో పాటు, తగిన పంటలు సాగు చేయవచ్చని సంగారెడ్డి జిల్లా కంది అగ్రికల్చర్ విద్యార్థులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని తునికి గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా వారు రైతులకు ఉచిత భూసార పరీక్షలు చేశారు. అనంతరం వారు డా.రామానాయుడు వృద్ధాశ్రమంలో పరిసరాలు శుభ్రం చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు హరి, రమేశ్, నీలాంబిక, విద్యార్థులు శివప్రసాద్, జితేందర్, జయప్రకాశ్, వర్షిత్, అజయ్, సాత్విక్ పాల్గొన్నారు.

◆ 30 శాతం నిధులు కేటాయించాలి

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్య సంస్థలన్నింటికీ 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

◆ నక్షబాటలో నిర్మాణాన్ని అడ్డుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండీ గ్రామ శివారు ఎదుల్లాపూర్ పంచాయతీ పరిధిలోని నక్షబాట స్థలంలో పలువురు వ్యక్తులు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారని రైతులు పోచయ్య, బుచ్చయ్య, వెంకటేశ్, మల్లేశ్ ఆరోపించారు. అక్రమ నిర్మాణ పనులను అడ్డుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయం గురించి తహసీల్దార్ కమలాద్రి దృష్టికి తీసుకెళ్లగా నక్షబాటను పరిశీలించి అక్రమ నిర్మాణ పనులు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ అనుమానిత వ్యక్తి పోలీసులకు అప్పగింత

నర్సాపూర్ : మండల ప్రజా పరిషత్తు కార్యాలయ ఆవరణలోని స్టోర్ క్వార్టర్స్ వద్ద అనుమానంగా తిరుగుతున్నట్లు గుర్తించి సిబ్బంది పోలీసులకు అప్పగించారు. కాగా స్టోర్ తాళాలు ధ్వంసం చేసి ఉన్నాయని తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్ఐ లింగంను వివరణ కోరగా మండల కార్యాలయ సిబ్బంది ఒక వ్యక్తిని తమకు అప్పగించారని, అతన్ని విచారిస్తున్నామని తెలిపారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దశంకరంపేట(మెదక్)/కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో మండలాల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెద్దశంకరంపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, గంగారెడ్డి, పెరుమాండ్లు, శ్రీనివాస్, సాయిరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గయ్య, సాయిలు, లక్ష్మణ్, శంకరయ్య తదితరులున్నారు.

కౌడిపల్లి మండల పరిధిలో..

మండల పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటానికి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, వీరేశ్ గౌడ్, పోచయ్య, పరమేశ్, రవి, ఇస్మాయిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.